


*(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)*

97

(19' నవంబర్ 69, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)

**పూర్వం** మన దేశంలో స్త్రీ కంటే పురుషుడు ఎక్కువ అనే భావం వుండేది. ఉండటమేమిటి? అలాగే ప్రవర్తించేవారు పురుషపుంగవులు.. పురుషుడు ఎలాటివాడైనా అతడొక గురుపీఠంగా భావించబడేవాడు.

ఆయన తపస్సంపన్నుడనీ, ఆవిడ శిష్యపరమాణువనీ, లేదా దాసి అని నిర్ణయించబడింది. ఆ వ్యత్యాసాన్ని ఆధారం చేసుకునీ పురుషుడు ఆధిపత్యం వహించి, అధికారం చలాయిస్తూ వచ్చాడు.

కానీ ఈనాడు ఆ వ్యత్యాసం అనవసరమని కృత్రిమమనీ గ్రహించింది ఈ లోకం. స్త్రీ బానిస కాదనీ, సమాన ప్రతిపత్తులు గల వ్యక్తి, అని హెచ్చరించి, వెనుకటి పిచ్చిభావాన్ని తొలగించారు చాలావరకు. 'నీకు నువ్వెక్కువ నాకు నేనెక్కువ' అనే భావాన్ని స్పష్టంగా చెప్పకలుగుతోంది మహిళ.

"ఫాలాక్షుడంతటి వాడే భార్యకు అర్ధస్థానమిచ్చి ఆమెలోగల సమానత్వాన్ని రుజువు చేయగలిగాడు. అలాంటప్పుడు ఈ నీలాచలాలొకలెక్కా".అంటున్నారు, కొందరు ఆర్గ్యుమెంట్ కోసం.

మొత్తం మీద ఈ కాలంలో పురుషుల "ఎక్కువతనం క్రమక్రమంగా క్షీణించిపోయి స్త్రీల తక్కువతనం" అదృశ్యమవుతోంది. సాంఘికంగా ఇది ఒక గొప్ప అదృష్టం.

కొందరు వ్యక్తులు ప్రపంచంలో ఇంకెవరు వ్యక్తులు లేరన్నంత మూర్ఖత్వంతో తాము ఎక్కువవారం అనుకోవడం పరిపాటి అయింది. ఎవరింటి వారు ఎక్కువ కావచ్చు. కానీ లోకానికేం ఎక్కువ.

వెనుకటికి బందరులో మా మేష్టారు ఒకరు అంటుండేవారు. "ఎవడింట్లో వాడు ఎక్కువే అనవచ్చు కానీ ప్రక్క యింటితో పోల్చుకుంటే రెండోవాడు... ఆ వీధిలో గల వాళ్ళందరితో పోల్చుకుంటే పదోవాడో, ఇరవయ్యోవాడో... ఆ పట్టణంలో వారితో పోల్చుకుంటే, ఏభయ్యోవాడో అవుతాడు. దేశం మొత్తం మీద ఆలోచిస్తే ఒకటి ప్రక్కన వంద సున్నాలు చుట్టాలి. కనుక ఎక్కువ అనేదానికి అర్థంలేదు. ఎందరో వుంటారు తన్ను మించినవాళ్ళు. "నాకు నేనే" అనుకునేవాడికి తిప్పలూ వుండవు. 'నా అంతవాడు లేడు' అనుకునేవాడికి ఎప్పటికైనా మాడుపోటు తప్పదు" అనీ.

మా బంధువుల్లో ఒకాయన వున్నాడు. ఆయన పనివేళ భార్యను సావిట్లోకి పిలిచి తాను వీధి కిటికీలో తలదూర్చి ఎదురుగా వున్న మేడమీద పచార్లు చేసే పెద్దమనిషిని చూపించి.

"ఆయన అంత బడాయి చూపిస్తాడు. మనకంటే ఏం ఎక్కువే?" అని ప్రశ్నించేవాడు. నిజానికి ఆవిడ మనస్సులో "ప్రపంచంలో ఎవరన్నా నీకంటే ఎక్కువే. ఇన్ని కుళ్ళుగుణాలు ఎవరిలో వుండవు?" అనాలనిపించేది.

కానీ బయటికి భార్య నిలబెట్ట వలసిన మర్యాద ప్రకారం "అబ్బే ఎందులో ఎక్కువ. ఊరికే అలా పిచ్చి తిరుగుడు తిరుగుతాడు" అనేది.

"ఇక్కడ కాదే రోడ్డుమీద కూడా అలాగే బడాయిగా నడుస్తాడు. పలుకరించినా సరిగ్గా మాట్లాడడు. ఏమిటో ఆ ఎక్కువ అర్థంకాదు" అని ఆయన ప్రశ్న.

" ఆయన ఎక్కువేమిటి నా ముఖం? అయినా ఆయన్ని మీరు పలకరించడమేమిటీ? అంతగా అవసరమొస్తే ఆయనే పలకరిస్తాడు. మీరు ఈసారి కనిపిస్తే అసలు మాట్లాడకండి. మీరెక్కడ ఆయనెక్కడ? చట్టిముక్కూ వాడూనూ" అని ఆవిడ వ్యాఖ్యాత.

"వాడి ముఖం వాడెంత. మూడేళ్ళ క్రిందవరకూ యు.డీ.సి. ఇంకా సూపరింటెండుగా మూడేళ్ళు సర్వీస్ కాలేదు. ఇక అందులో నుంచి పైకి వెళ్ళే ఛాన్సు కూడా లేదు. అంత షోగ్గా తిరుగుతాడేం అప్పుచేసి కట్టిన ఆ మేడ మీద?" అని భర్త ప్రవచనం.

"అయినా మీరా కిటికీ తెరిచారెందుకు? మూసెయ్యండి. వాడు నాట్యం చేస్తే మాత్రం మనకేం కనపడుతుంది. అసలు నేనెప్పుడూ ఆ కిటికీ తియ్యను, రోత" అంటుందామె.

"నే మాత్రం తీస్తానా!? ఇవ్వాళ ఆదివారం గదా అని తీశా. తియ్యగానే వాడు కనిపించాడు. అయినా ఎప్పుడు తీసినా వీడే కనిపిస్తాడే పెళ్ళాం ఎప్పుడూ కనిపించదేం?" అని ఆయన ప్రశ్న. "ఏమో వాడు తిరుగుతున్నాడని బయటికి రాలేదేమో. లేకపోతే ఎప్పుడూ అక్కడే వుంటుంది. ఓ పట్టు చీరకట్టి, పిట్టగోడమీదకు వంగి లొట్టి పిట్టల్లే చూస్తూనే వుంటుంది వీడి వంక. అలా చూసి చూసి ఆమె మెడ అలా ఒంగిందనిపిస్తుంది" అంటుందావిడ.

ఇలా ఒకళ్ళని తక్కువ చెయ్యడం ద్వారా తమ ఎక్కువతనాన్ని నిలబెట్టుకోవాలి అని తాపత్రయపడుతూ వుంటారు కొందరు. మహనీయులు పెద్ద గీత దగ్గర దానికన్నా చిన్న గీత గీసి పెద్ద గీత పరువు నిలబెట్టినట్లు.

పోతే మన దేశంలో 'ఎక్కువ' జాబితాలోకి వచ్చేవి ఏమిటి? అని ప్రశ్న వేసుకుంటే తేలేవి చాలా వున్నాయి.

రాజకీయ కక్షలు, సమ్మెలు, సత్యాగ్రహాలు, రాళ్ళు విసరడాలు, నిప్పు అంటించడాలు, దొంగతనాలు, ధిక్కారాలు దౌర్జన్యాలు, అవినీతి చర్యలు, లంచగొండితనాలు, నగర నదీజలాల పంపిణీ తగాదాలు, సవాళ్ళు, పరవళ్ళు, పదవీ వ్యామోహాలు, పరపతీ వ్యామోహాలు, మైకుల గందరగోళాలు, శిలావిగ్రహాలు, నీలాపనిందలు, పెళ్ళియీడు దాటిన వధువులు, "అప్పుడే ఏం పెళ్ళి" జపం చేసే ఈడు దాటిన వరుళ్ళు, మతి తప్పిన తండ్రులు, శ్రుతి తప్పిన దాంపత్యాలు మితిమీరిన అసత్యాలు.

బజారు ధరలు, వరదలు, తుఫానుగాలులు, ఇంటికి తెచ్చి ఇచ్చే ప్రభుత్వ ఋణాలు, లాటరీ పణాలు, వికృత గుణాలు, అశాంతి ఆరాటం, అనవసర పోరాటాలు, నీళ్ళు రాని పంపులు, ముసలితనపు వొంపులు, మంత్రివర్యుల క్యాంపులు, అసభ్యతకు సంబంధించిన ముంపులు, ఇలా ఎన్నెన్నో చెప్పవచ్చు.

పోతే 'తక్కువల' జాబితాలలో చేర్చదగినవి కూడా చాలా వున్నాయి. ఉదాహరణకు కొన్ని సూచిస్తాను. పెద్దల మాటలకు విలువలు అసలు మానవాత్మకు నెలలు, మంచితనం, సేవాభావం, గుట్టుసంసారాలు, గుండెల వీరులు, ధర్మవాక్కులు, సత్య ప్రచారాలు, భక్తి ప్రబోధనలో, దానధర్మాలు, వినయవిధేయతలు, పార్టీభక్తి, తోటివారిపై అనురక్తి, ఆధ్యాత్మిక శక్తి, యుగంధర యుక్తి, పాపవిముక్తి, నిస్వార్థం, నిండుతనం, మిత సంభాషణ, సంసార పోషణ, పుష్టి భోజనం, తుష్టి జీవనం, దాంపత్య రహస్యాలు, వ్రతాలు, క్రతువులు.

అయిదు రోజుల పెళ్ళిళ్ళు, ఆడవాళ్ళు కాళ్ళకు కడియాలు, ఎడంచేతి గాజులు, భర్తలపై మోజులు, చెక్కిట జాజులు, సంతానంపై వాత్సల్యం, వాకిట్లో రంగవల్లులు, ఇంట్లో మంగళహారతులు, జోలపాటలు, వంటింట్లో పొయ్యిలు, ఇత్తడి సామానులు, ఏడు గజాల చీరలు, ఇలా ఎన్నెన్నో తక్కువ జాబితాలలో సరిపోయాయి.

ఈ ఎక్కువ తక్కువల ప్రభావం తలుచుకుని ముక్కుమీద వ్రేలు వేసుకునేవారూ ఉన్నారు. చెక్కిట కెంపులు పూయించుకునే వారూ ఉన్నారు.

Post your comments